దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివి

● మంత్రి పొన్నం ప్రభాకర్


దామోదరం సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వీహెచ్ తదితరులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్య మంత్రి దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా ఎల్‌బీ స్టేడియం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహనీయుల ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. మాజీ ఎంపీ వి. హనుమంతరావు మాట్లాడుతూ.. దామోదరం సంజీవయ్య సీఎంగా మంచి పరిపాలన అందిచారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డిరాంబాబు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఎం. మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.


కౌ హగ్ డేలో గో సేవా ఫౌండేషన్ సభ్యులు

గోవును జాతీయ జంతువుగా గుర్తించాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గోవులను రక్షించాలని అఖిల భారత గో సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ అన్నారు. గోవును జాతీయ జంతువుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్ గోశాల ప్రాంగణంలో అఖిల భారత గోసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ గోప్రేమికుల దినోత్సవం నిర్వహించారు. 'ప్రేమికుల దినం వద్దు గోసేవ ముద్దు' అంటూ 'సేవ్ కౌహగ్ డే నిర్వహించారు. ఫౌండేషన్ సభ్యులు గోవులను ఆలింగనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గోశాల వద్ద ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. బాలకృష్ణ మాట్లాడుతూ.. నేషనల్ కౌ హగ్ డేను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట గోశాల పీఠాధిపతి వీరధర్మజాస్వామి, గో రక్షణ సమితి మూడు రాష్ట్రాల ఇన్‌చార్జి ఆకుతోట రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను సద్వినియోగం చేసుకోవాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, మాజీ కార్పొరేటర్ పులి జగన్ కోరారు. బుధవారం కాచిగూడ డివిజన్ రహమత్‌బాగ్‌లో గృహజ్యోతి దరఖాస్తులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు గరిగంటి రమేష్, దీపిక, విద్యుత్ ఏఈ అంజన్ తదితరులు పాల్గొన్నారు.

'రేషన్‌కార్డు నిబంధనను తొలగించాలి'

నల్లకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలకు రేషన్‌కార్డు తప్పని సరి అనే నిబంధనను తొలగించాలని కార్పొరేటర్ యాకర అమృత డిమాండ్ చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలును స్వాగతిస్తున్నామన్నారు. పదేళ్ల నుంచి పౌర సరఫరాల శాఖ రేషన్ కార్డులు జారీ చేయలేదన్నారు. దీంతో రేషన్ కార్డులు లేని వారు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి : కార్పొరేటర్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో పెండింగ్ పనులను పూర్తిచేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. బుధవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చప్పల్ బజార్, నింబోలిఅడ్డ, జమాల్ బస్తీ, ఏకే భవన్, కాచిగూడ పెట్రోల్ బంక్, బాలప్పబాడ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు మంజూరైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదన్నారు.

పక్షవాత రోగులకు ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పక్షవాతం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు ఉచితంగా ఫిజియోథెరపీ వైద్య సేవలు అందజేస్తున్నామని హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాసరావు తెలిపారు. కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదుట గల వీరన్నగుట్ట శ్యామ్ బాబా మందిరం ప్రాంగణంలోని ఫిజియోథెరపీ సెంటర్‌లో వైద్య సేవలు పొందవచ్చన్నారు. ఫిజియోథెరపీ కిట్స్ కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఫిజియోథెరపీ సేవలు పొందవచ్చన్నారు. సేవా కేంద్రానికి రాలేనివారికి వారి ఇంటి వద్దనే మొబైల్ సేవలు అందజేస్తామన్నారు. వివరాలకు 9949238492 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

రాత్రి అదృశ్యం.. ఉదయం నాలాలో మృతదేహం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఎదుట ఆడుకుంటున్న బాలుడు రాత్రి అదృశ్యమయ్యాడు. మరుసటి రోజు సమీపంలో ఓ నాలాలో మృతదేహం లభించింది. జూబ్లీహిల్స్ రోడ్డు నం. 5 దుర్గాభవానీనగర్ బస్తీలో నివసిస్తున్న మునావత్ కవిత, రమేష్ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు ఎం.కార్తీక్(11) జవహర్‌నగర్‌కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 13న బస్తీలో పిల్లలతో కలిసి కార్తీక్ ఆడుకుంటూ రాత్రి 8 గంటల తరువాత కనిపించకుండా పోయాడు. బాలుడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం బస్తీకి ఆనుకొని ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కులో నుంచి వెళుతున్న నాలాలో పరిశీలించగా కార్తీక్ మృతదేహం లభించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వసంత పంచమి..

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాంనగర్/కవాడిగూడ/చిక్కడపల్లి,/నల్లకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకుని రాంనగర్, అడిక్‌మెట్, బాగ్‌అంబర్‌పేట డివిజన్లలో బుధవారం ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అంబర్‌పేట మహంకాళి దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు. బాగ్‌లింగంపల్లిలో షిరిడీ సాయిబాబా ఆలయం వద అన్నదాన కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. రాంనగర్ రామాలయం, అడిక్‌మెట్ వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకమ్మకుంట మైసమ్మ దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట శివకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

● కవాడిగూడ ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు చదువులో రాణించి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపల్ పి. స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చిక్కడపల్లి నగర గ్రంథాలయ సంస్థ ఆవరణలో సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్, గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి పళని కదిరవన్, లైబ్రరీ కార్యదర్శి పొట్లూరు పద్మజ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షల అభ్యర్థులు, విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు.


అంబర్‌పేట మహంకాళి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను సన్మానిస్తున్న మహంకాళి ఆలయ సమితి సభ్యులు


నగర గ్రంథాలయంలో సరస్వతి పూజలో జాయింట్ కలెక్టర్, లైబ్రరీ కార్యదర్శి, సిబ్బంది


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

ఏఎల్ మల్లయ్యకు నివాళి

కవాడిగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్‌గా, బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా ఏఎల్ మల్లయ్య చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. బీసీలు ఆయన ఆశయసాధనకు పాటుపడినప్పుడే మల్లయ్యకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం కవాడిగూడ బండమైసమ్మనగర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీసీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ భాగయ్య, అధ్యక్షుడు ఎంఎస్ నరహరి. సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, ఉపాధ్యక్షులు శివరత్నం, ఆర్‌కే భగవాన్, బాలయ్య, సెక్రటరీ ఓం ప్రకాష్,యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబటి మల్లయ్య సుధాకర్ గంగపుత్ర,. ఉపాధ్యక్షులు కట్టా నర్సింగ్, తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర ఉద్యోగ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఏఎల్ మల్లయ్య ప్రథమ వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి గంగపుత్ర సంఘం గ్రేటర్ ఉపాధ్యక్షుడు గాండ్ల మీసాల ప్రసాద్, ఆలిండియా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు పూస గోరక్‌నాథ్, సీనియర్ నాయకుడు బిజ్జి రవి తదితరులు పూలమాలలు నివాళులర్పించారు. మల్లయ్య వర్ధంతి, జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.



మల్లయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, గంగపుత్ర సంఘం గ్రేటర్ ఉపాధ్యక్షుడు గాండ్ల ప్రసాద్ తదితరులు

రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లు బీజేపీవే

రాజ్యసభ సభ్యుడు డా. లక్ష్మణ్ ధీమా

బర్కత్‌పుర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో మునిగిపోయిన పడవ బీఆర్‌ఎస్ అని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ పడవ మునగబోతోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఎద్దేవ చేశారు. సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాలతోసహా రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాల్లో బీజేపీ విజయం సాధించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ ప్రధాని పదవికి అనర్హుడని విమర్శించారు. బుధవారం బర్కత్‌పురలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో విద్యావంతులు, మేధావులు బీజేపీకి అండగా నిలవాలని కోరారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే మోదీనే ప్రధాని కావాలన్నారు. దేశంలో కాంగ్రెస్ గెలవదని, రాహుల్ గాంధీ ప్రధాని కాలేరన్నారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో బీజేపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నాయకులు కృష్ణాయాదవ్, మర్రి శశిధర్‌రెడ్డి, చంద్రశేఖర్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డా. లక్ష్మణ్; చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

'ఉస్మానియా' రక్షణకు వారసత్వ పరిరక్షణ కమిటీ వేయాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రి రక్షణకు వారసత్వ పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని, జీవో 313 అమలు చేయాలని ఆస్పత్రి పరిరక్షణ గ్రూపు ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆస్పత్రిని పరిరక్షించాలని అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రూపు ప్రతినిధులు అనురాధ రెడ్డి, డాక్టర్ జస్వీన్ జైరత్, సారా మాథ్యూస్, డాక్టర్ ఇక్బాల్ జావీద్, డాక్టర్ ఆసిఫ్ హనీఫ్ మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న భవనానికి మరమ్మతులు చేపట్టి వైద్య సేవలు కొనసాగించాలన్నారు. ఖాళీగా ఉన్న ప్రదేశంలో అధునాతన వసతులతో కొత్త భవనం నిర్మించాలని ముఖ్యమంత్రికి సూచించారు.

ఆకట్టుకున్న ఘంటసాల గానవిభావరి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సుస్వర సుగుణ కళాభారతి, రవిమన్యు ఆర్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన ఘంటసాల గానవిభావరి ఆకట్టుకుంది. అమరగాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రవిమన్యు, మధుబాపుశాస్త్రి, జి. శ్రీనివాస్, సుధీర్ కుమార్, వేలూరి రామకృష్ణారావు, త్రినాథరావు తదితర గాయనీగాయకులు గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ. వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రతిభావంతులైన చిన్నారులకు జ్ఞాపికలు బహూకరించారు. వంశీ రామరాజు, నిర్వాహకుడు రవిమన్యు, బీజేపీ నేత మల్లెపూల వెంకటరమణ, పురుషోత్తంగౌడ్, ఆనంద్‌రెడ్డి గాయనీగాయకులను అభినందించారు.

సీతారామయ్య అవార్డు ప్రదానం

మాజీ ఎమ్మెల్యే, సంఘసేవకుడు సీతారామయ్య స్మారక అవార్డును కాంగ్రెస్ సీనియర్ నేత, సంఘ సేవకుడు గండి శ్రావణ్‌కుమార్‌కు బహూకరించారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలో నిర్వహించిన సమావేశంలో సీతారామయ్య సతీమణి డా. దాక్షాయని ముఖ్యఅతిథిగా పాల్గొని అవార్డును బహూకరించారు. సామాజిక కార్యకర్తలు డా. గొల్లపల్లి దయానందరావు, డా.ఎస్తేర్‌రాణి, పీసీసీ నేత మల్లు శివరామ్, న్యాయవాది జగదీష్, యువజన సంఘం అధ్యక్షులు అనితారాజీవ్ పాల్గొన్నారు.

గాంధీనగర్ ఇన్‌చార్జి సీఐగా ఎం. వరప్రసాద్



కవాడిగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ ఇన్‌చార్జి సీఐగా దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎం. వరప్రసాద్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా మల్టీ జోన్ 2 నుంచి గాంధీనగర్ కు బదిలీ అయిన డీకే మహేశ్వర్‌రావు సిక్ లీవ్‌లో ఉన్నారు. దీంతో ఆయన స్థానంలో వరప్రసాద్‌ను ఇన్‌చార్జి సీఐగా నియమించారు. ఇప్పటివరకు గాంధీనగర్ సీఐగా ఉన్న నునావత్ రవి ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రిపోర్ట్ చేశారు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ముషీరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ అంజుమన్ హాల్‌లో ముషీరాబాద్, హిమాయత్‌నగర్ తహసీల్దార్ పరిధిలో 81మందికి షాదీముబారక్, 9 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. ముషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ హేమంత్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

రక్తంతో కార్పొరేటర్ దంపతుల రేఖా చిత్రం


కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ దంపతుల రేఖా చిత్రాన్ని రక్తంతో గీసి వారికి అందజేస్తున్న బీజేపీ నాయకుడు ప్రశాంత్

జీహెచ్‌ఎంసీలో కదిలిన కుర్చీలు

పాతుకుపోయినవారికి స్థానచలనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో ఎన్నేళ్లుగా పాతుకుపోయిన డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కలిగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లను బదిలీలు చేయగా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఒకే స్థానంలో ఏళ్లతరబడి ఉన్న పది మందిని బదిలీ చేశారు. వారి స్థానంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని నియమించారు. ఏశైలజ, ఎండీ షేక్, డి.సుభాష్‌రావుకు పోస్టింగ్ ఇవ్వలేదు.

పేరు	ప్రస్తుతం పని చేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
జకీయ సుల్తానా	డీప్యూటీ సీఈఓ	సర్కిల్-4, ఎల్‌బీనగర్ డిప్యూటీ కమిషనర్
ఎ.సుజాత	సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్	సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్
సీహెచ్.నాగేశ్వరరావు	రామగుండం, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-12, మెహిదీపట్నం డిప్యూటీ కమిషనర్
జి.వేణుగోపాల్ రెడ్డి	బోడుప్పల్, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-29, సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్
శివకుమార్	డిప్యూటీ కలెక్టర్, విజిలెన్స్, జీహెచ్‌ఎంసీ	సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్
ఎస్.విద్యాధర్	గజ్వేల్, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-14, గోషామహల్ డిప్యూటీ కమిషనర్
వి.సమ్మయ్య	తెల్లాపూర్, డిప్యూటీ కమిషనర్	సర్కిల్-30, బేగంపేట డిప్యూటీ కమిషనర్
ఖాదర్ మొయినుద్దీన్	వెయిటింగ్	సర్కిల్-15, ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్
తిప్పర్తి యాదయ్య	ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్	సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్
జి.ఆంజనేయులు	డిప్యూటీ కమిషనర్, జీహెచ్‌ఎంసీ	సర్కిల్-2, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్
టి.దశరథ	సర్కిల్-4, ఎల్‌బీనగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్
పి.రవీందర్‌కుమార్	సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్
సీహెచ్.అరుణకుమారి	సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్
ఎ.నాగమణి	సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్

యువత రక్తదానం

రాంనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):రక్తదానంపై యువతకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కార్పొరేటర్ కె.రవిచారి సూచించారు. బుధవారం సంజీవని బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో బాగ్‌లింగంపల్లిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లు అందజేసి సన్మానించారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

ముషీరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): టీబీ యూనిట్ ఆస్పత్రి ప్రాంగణంలో మిథాని సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 70 మంది టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సకాలంలో మందులు వాడితే టీబీ నయం అవుతుందన్నారు. వ్యాధి సోకిందని భయపడాల్సిన అవసరం లేదన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య


నిఖిత (ఫైల్)

కవాడిగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థిని, టీస్టాల్ నిర్వాహకుడు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. దోమలగూడ తాళ్లబస్తీలో నివసిస్తున్న భీంరాజ్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె ఎస్. నిఖిత(17) నారాయణగూడలో ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆరు నెలల నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీ గ్రిల్స్‌కు చున్నీతో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు ఇంటికి రాగా తలుపు వేసి ఉంది. స్థానికుల సహాయంతో తీసి చూడగా నిఖిత ఉరేసుకొని ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమెను ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీస్టాల్ నిర్వాహకుడు..


దేవిదాస్ (ఫైల్)

అంబర్‌పేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): టీస్టాల్ నిర్వాహకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అంబర్‌పేట సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ మాలేగావ్‌కు చెందిన దేవిదాస్ సోపాన్(34) గోల్నాక శాంతినగర్‌లో నివసిస్తూ కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలో టీస్టాల్ నిర్వహిస్తున్నాడు. అతడి భార్య ఇద్దరు పిల్లలను తీసుకొని ఇటీవల మహారాష్ట్రలో స్వగ్రామానికి వెళ్లింది. ఈనెల 13వ తేదీ రాత్రి దేవిదాస్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి అచ్చయ్యనగర్‌లో నివసిస్తున్న రజని, జి. బాలకృష్ణకు 2004లో వివాహం అయింది. మరో వివాహం చేసుకోవాలనే ఉద్దేశంతో 2013 సెప్టెంబర్ 27వ తేదీ అర్ధరాత్రి బాలకృష్ణ భార్య రజనిని కత్తితో మెడపై పొడిచి హత్య చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసును విచారించిన నాంపల్లి మూడో అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి జె. కవిత బాలకృష్ణకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కదులుతున్నరైలు దిగుతూ మహిళ మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు దిగుతూ ఓ మహిళ మృతిచెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ వి.లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు చెంగల్పట్టుకు చెందిన ముత్తు చిన్నస్వామి భార్య ముత్తు సిల్వ (22)ఏడాది కుమార్తెతో కలిసి ఉప్పుగూడలో బంధువుల ఇంటికి వెళ్లడానికి చెంగల్పట్టు రైలులో నగరానికి వచ్చారు. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో కాచిగూడ రైల్వే స్టేషన్‌లో 5వ ప్లాట్‌ఫారం పైకి రైలు వచ్చింది. ముత్తు సిల్వ కదులుతున్న రైలు దిగబోతూ కిందపడడంతో తీవ్రంగా గాయపడింది. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మృతి

● మరో ఎస్‌ఐకి గాయాలు

కొత్తపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మృతి చెందారు. మరో ఎస్‌ఐ గాయపడ్డారు. ఎల్‌బీనగర్ ఎస్‌ఐ దయాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నకిరేకల్‌కు చెందిన మహ్మద్ సాదిక్‌అలీ(40) మలక్‌పేట ఏ- బ్లాక్ క్వార్టర్స్‌లో ఉంటూ చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నారాయణగూడ ఎక్సైజ్ ఎస్‌ఐ ఖాజావలి మొయినుద్దీన్(52) కూడా ఏ- బ్లాక్‌లోనే ఉంటున్నారు. ఇద్దరూ కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై ఎల్‌బీనగర్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. 11.40 గంటలకు తిరిగి బైక్‌పై మలక్‌పేట బయలుదేరారు. సరూర్‌నగర్ స్టేడియం వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న కారు వారి బైక్‌ను ఢీకొట్టింది. ఇద్దరూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సాదిక్‌అలీ, ఖాజావలీని 108 అంబులెన్స్‌లో ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి సాదిక్ అలీ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఎస్‌ఐ ఖాజావలీ చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడు ఎండీ అబ్దుల్ అలీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్ హత్య కేసు..

పోలీసుల అదుపులో రౌడీషీటర్ జిలాని

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రియల్టర్, బీజేపీ నాయకుడు సింగోడి రాము హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన రౌడీషీటర్ జిలానీని పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రాముపై పగతో మణికంఠ హత్య చేసేందుకు పథకం వేయగా రౌడీషీటర్ జిలానీ తన మనుషులతో పాల్గొన్నాడు. హత్య అనంతరం జిలాని అక్కడి నుంచి పారిపోయాడు. అతడి అనుచరులు పోలీసులకు పట్టుబడ్డారు. అనేక హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న జిలానీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఈ హత్యలో జీడిమెట్లకు చెందిన గణపతిని రిమాండ్‌కు తరలించారు.